సాక్షి చిత్తూరు

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



ఆహారం అందిస్తూ..

కుప్పంలో ఏర్పాటు చేసిన రాజన్న క్యాంటిన్ ద్వారా ఎమ్మెల్సీ భరత్ నిరుపేదల కడుపు నింపుతున్నారు. - 8లో



అలసత్వం లేకుండా విధులు

ఎన్నికల విధులను సంబంధిత సిబ్బంది అలసత్వం లేకుండా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని జేసీ ఆదేశించారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని పార్టీ అభ్యర్థులు ఆహ్వానించారు. - 8లో

న్యూస్‌రీల్

మంచి జరిగితేనే మద్దతు



సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు మేలు జరిగిందని భావిస్తేనే మద్దతు పలకాలని న్యాయవాదులను ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ కోరారు. మంగళవారం పలమనేరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అప్రెంటిస్ న్యాయవాదులకు లా నేస్తం అందించామన్నారు. అదే కాకుండా సాధారణ ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని పరిశీలించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడాను గమనించాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డుకోవడం అవాస్తవం!

చిత్తూరు కార్పొరేషన్: అటవీశాఖలో దళిత అధికారి చేరకుండా అడ్డు అని ఈనాడు పత్రికలో సోమవారం వచ్చిన వార్తలో నిజం లేదని కుప్పం ఎఫ్ఆర్ఓ జయశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐరాల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా ఉండగా మార్చి 15న ఎఫ్ఆర్ఓగా ఉద్యోగోన్నతి వచ్చిందన్నారు. తరార్వత కుప్పం ఎఫ్ఆర్ఓగా ఈనెల 4న బాధ్యతలు అప్పగించారని వెల్లడించారు. దళిత అధికారిని విధుల్లోకి రానీయకుండా మంత్రి అండదండలతో ఓ అధికారి అడ్డుకుంటున్నాడని రాసిన వార్త పూర్తిస్థాయిలో అబద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి వార్తలతో అటవీశాఖపై బురదజల్లడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరో గిట్టని వారు పుట్టించిన పుకార్లను నిర్ధారణ చేసుకోకుండా ప్రచురించడం అన్యాయమని మండిపడ్డారు.

ఈఎంటీ, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

పలమనేరు : జిల్లాలోని 108 వాహనాల్లో ఈఎంటీ, డ్రైవర్లు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని 108 మేనేజర్ మహేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల వారు ఈనెల 19వ తేదీలోపు జిల్లా ఆస్పత్రిలోని 108 ఆఫీసులో దరఖాస్తు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9502214614, 9742496802, 8019874684 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్మోగుతున్న జగన్నినాదం



టీడీపీ సభలో జై జగన్ అంటూ నినదిస్తున్న యువత

పలమనేరు : వైఎస్సార్‌సీపీ సమావేశాలు, ప్రచారాల్లో జై జగన్ నినాదాలు మామూలే. అయితే టీడీపీ, కాంగ్రెస్, జనసేన నిర్వహిస్తున్న సభలు, కార్యక్రమాల్లోనూ జైజగన్ నినాదాలు మార్మోగుతున్నాయి. రెండు రోజుల క్రితం మాజీ మంత్రి, టీడీపీ పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథరెడ్డి ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీని విమర్శిస్తుండగా అక్కడున్న విద్యార్థులు జై జగనన్న అంటూ నినాదాలు మిన్నంటించారు. దీంతో అమరనాథరెడ్డి అవాక్కయ్యారు. దీన్ని కొందరు సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. ఇదే క్రమంలో మూడురోజుల క్రితం పలమనేరులో షర్మిలమ్మ చేపట్టిన ఎన్నికల ప్రచార సభలోనూ జై జగన్ నినాదాలు హోరెత్తాయి. దీంతో ఆమె చేసేది లేక మిన్నకుండిపోయారు. అంతకుముందు జనసేన యూత్ సైతం ర్యాలీ చేస్తూ జై జగన్ అంటూ నినాదాలు చేయడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,511 మంది స్వామివారిని దర్శించుకోగా, 26,553 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.28 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పసుపు దగా..!

2014లోఎన్నికలకు ముందు. 'మేం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తాం. ఏం అక్కచెల్లెమ్మలూ..! మీరెవ్వరూ బ్యాంక్‌ల్లో రుణాలు చెల్లించొద్దు. అంతేకాదు.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం. ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తాం. ప్రతి మహిళనూ లక్షాధికారిని చేస్తాం. ప్రతి రైతునీ రారాజుని చేస్తాం' అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రజలందర్నీ బురిడీ కొట్టించారు. 2014 నుంచి 2019 వరకు కుంభకర్ణుడిలా నిద్రపోయి ఎన్నికల ముందు మేల్కొన్నారు. మహిళల పవిత్రతకు ప్రతీకైన పసుపు–కుంకుమ పేరుతో ముష్టివిదిల్చినట్టు చిల్లర వేసి మహిళల ఓట్లు దండుకోవాలని చూసి బోల్తాపడ్డారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మరో మారు మాయచేసేందుకు సన్నద్ధమయ్యారు. దీనిపై మహిళలు మండిపడుతున్నారు. మాయలోడి మాటలు నమ్మబోమని తేల్చిచెబుతున్నారు. ఇచ్చినమాటకు కట్టుబడిన జగనన్నకే మా మద్దతు అని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఎన్నికల ముందు చంద్రబాబు బూటకపు హామీలు

- 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణమాఫీ అంటూ మోసాలు
- 2019 ఎన్నికలకు ముందు పసుపు–కుంకుమ పేరుతో దొంగ నాటకాలు
- ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ నన్నాయి నొక్కులు
- ముక్కున వేలేసుకుంటున్న జనాలు
- మేం నమ్మం బాబోయ్ అంటున్న మహిళలు

బాబుది పచ్చి మోసం



హిందూ మహిళలు పవిత్రంగా భావించే పసుపు–కుంకుమ పేరుతో చంద్రబాబు మమ్మల్ని మోసం చేసేందుకు ప్రయత్నించారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే తుంగలో తొక్కేశారు. ఆయన కారణంగా మేము బ్యాంకర్లతో నానా మాటలు పడాల్సి వచ్చింది. మనశ్శాంతిని పోగొట్టుకోవాల్సి వచ్చింది. డిఫాల్టర్‌గా మా గ్రూపు మారడంతో ఇతర అప్పులు కూడా రాని పరిస్థితి ఎదురైంది. అందుకే 2019 ఎన్నికల్లో పసుపు–కుంకుమ పేరుతో రూ.10వేలు ఇచ్చి మాయ చేయాలని చూసినా కీలెరిగి వాతపెట్టాం. ఓటుతో తగిన గుణపాఠం నేర్పించాం. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి సూపర్ సిక్స్ అంటూ వస్తున్నారు. చంద్రబాబు ఎలా నమ్మగలం. గతంలో డ్వాక్రా మహిళలకు రూ.3వేలు కూడా రుణ మాఫీ చేయలేని చంద్రబాబు, ఇప్పుడు మళ్లీ అధికారం ఇస్తే ఏదో చేస్తాడంటే ఎలా. సీఎం జగనన్న కరోనా కష్టాల్లో కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఏటా క్రమం తప్పకుండా డ్వాక్రా రుణమాఫీ చేశారు. వచ్చిన రుణమాఫీ నిధులతో చిన్న వ్యాపారాలు, పాడి ఆవులతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటాం. – లక్ష్మి, కనికాపురం, పాలసముద్రం మండలం

నట్టేట ముంచేశారు



చంద్రబాబు మాయ మాటలకు ఒకసారి మోసపోయాం. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. మేము కూడా సంబరపడిపోయాం. 45 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది. అధికారం వచ్చింది.. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఆశించాం. అయితే చంద్రబాము మమ్మల్ని నట్టేట ముంచేశారు. ఐదేళ్లపాటు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు కట్టలేక నానా అవస్థలు పడ్డాం. వడ్డీలు పెరిగిపోయాయి. కొత్త రుణాలు రాని పరిస్థితి. మళ్లీ 2019 ఎన్నికలు వచ్చేసరికి పసుపు–కుంకుమ పేరుతో రూ.10వేలు మా చేతిలో పెట్టారు. ఆ డబ్బులు వడ్డీలకు కూడా సరిపోలేదు. అందుకే ఆ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాం. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా మా రుణాలు మాఫీ చేశారు. మాకు కొత్తగా రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించారు. సున్నావడ్డీకే బ్యాంకర్లు రుణం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. మేము ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందించారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఏం చేశారో మాకు గుర్తుంది. ఎట్టి పరిస్థితుల్లో చంద్రబాబును నమ్మం. – బుజ్జి, చిత్తూరు

చంద్రబాబును ఎవ్వరూ నమ్మరు



చంద్రబాబు మాటలు విని.. నమ్మి అలసిపోయాం. ఇప్పుడు కుప్పంలో బాబు మాటలు ఎవ్వరూ నమ్మరు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదు. మాకైతే డ్వాక్రా రుణాలు మాఫీ, రైతులు రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారు. అప్పట్లో డ్వాక్రా రుణాలు మాఫీ కాకపోవడంతో అప్పులు, నగలు తాకట్టు పెట్టి కట్టాల్సి వచ్చింది. 2019 ఎన్నికల సమయంలో పసుపు–కుంకుమ పేరుతో రూ.10 వేలు ఇచ్చి చాలు పొమ్మన్నారు. సుమారు 35 ఏళ్లుగా చంద్రబాబును చూస్తునే ఉన్నాం. మాకైతే ఆయన చేసింది ఏమీ లేదు. వాళ్ల నాయకులు మాత్రమే బాగుపడ్డారు. నేను చిన్నప్పటి నుంచి చూస్తున్నా కుప్పంలో అదే రోడ్లు, అదే భవనాలే తప్పా అభివృద్ధి జరిగిందే లేదు. ఇప్పుడు చంద్రబాబుపై మాకు నమ్మకం పోయింది. ఇచ్చిన హామీలు కూడా జగన్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలనే మేమూ ఇస్తాం అంటున్నారు. గతంలో టీడీపీ ఉన్నప్పుడు వాటిని ఎందుకు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంలో మాకు అమ్మఒడి, జగనన్న తోడు, పక్కా ఇల్లు వచ్చింది. జగనన్న గోరు ముద్ద పథకం కింద పిల్లలు తృప్తిగాభోజనం చేస్తున్నారు. మేము చాలా సంతోషంగా ఉన్నాం. – ధనలక్ష్మి, అర్బన్ కాలనీ, కుప్పం

చంద్రబాబు మమ్మల్ని నవ్వుల పాలు చేశారు



నేను ఓంశక్తి గ్రూపులో ఉండా. ముందు చంద్రబాబు మా డ్వాక్రా వాళ్లకి రుణమాఫీ చేస్తామని చెప్పారు. దీంతో మా గ్రూపు సభ్యులంతా సంతోషపడిరి. నేను అప్పుడే చెప్పినా ఈ చంద్రబాబు మాట నమ్మితే పుట్టగతులుండవు అని. అప్పుడు ఎవరూ పట్టించుకోలే. తర్వాత ఆయన మమ్మల్ని పట్టించుకోకపోవడంతో అందరికీ తెలిసివచ్చింది. మళ్లీ అప్పుడు ఎలక్షన్ రాగానే పసుపు–కుంకుమ ఇస్తాం.. పచ్చచీరలు కట్టుకురండని మా గ్రూపోళ్లకి మీటింగులే మీటింగులు పెట్టారు. అప్పుడూ చెప్పినా ఆ యబ్బను నమ్మకండి మళ్లీ టోపీ పెడతాడు అని. అప్పుడు ఆడోళ్లందరూ నాపై ఎగిరినారు. మా గ్రూపోళ్లకైతే పసుపు–కుంకుమ రాలే. దీంతో అందరిలో మేమే నవ్వులపాలయ్యాం. అదే జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక సక్రమంగా వడ్డీ మాఫీ అయ్యింది. రుణం మాఫీ అయ్యింది. మాకు కొత్తగా రుణాలు కూడా ఇచ్చారు. ఆ బిడ్డ చల్లగా ఉండాల. అప్పుడే మాలాంటి పేదలు సల్లగా ఉంటారు. ఇక బతుకులో ఎప్పటికీ చంద్రబాబును మాత్రం నమ్మం అని మా గ్రూపోళ్లందరం తీర్మానం చేసుకున్నాం. – ఈశ్వరమ్మ, శెట్టిపల్లె, బైరెడ్డిపల్లె మండలం

బాబు మోసం చేశారు



చంద్రబాబు మీద కుప్పం ప్రజలకు అభిమానం తగ్గిపోయింది. గతంలో అయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డ్వాక్రా రుణ మాఫీ చేస్తామని నమ్మించి మోసంచేశారు. దీంతో చాలా నష్టపోయాం. ఎన్నికలు దగ్గర వచ్చినప్పుడు పసుపు– కుంకుమ పేరిట రూ.10 వేలు భిక్షంగా వేసి ఓట్లు కోసం డ్రామా చేసిన విషయం అందరికీ తెలుసు. ఇప్పుడు చంద్రబాబు చెప్పే మాటలను అసలు నమ్మలేం. అప్పట్లో మహిళలు ఆశ పడింది డ్వాక్రా రుణమాఫీ , రైతు రుణ మాఫీ రెండింటినీ ఇవ్వకుండా మోసం చేశారు.ఇప్పుడు బాబు ఎంత చెప్పినా జనం నమ్మరు. ఏళ్ల తరబడిగా కుప్పం ప్రజలు చంద్రబాబును చూశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మేలు చేసింది. మాకు కుటుంబానికి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న ఇల్లు వచ్చాయి. అదే స్కీమ్‌లు మేము ఇస్తామని టీడీపీ వాళ్లు వస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం మాకు అన్ని పథకాలు అందిస్తోంది. ఇంకా వీళ్లు వచ్చి ఇచ్చేదేంటో అర్థం కావడం లేదు. మమల్ని నిలువునా మోసం చేసిన చంద్రబాబును జీవితంలో నమ్మం. – మంజుల, ఎన్‌టీఆర్ కాలనీ, కుప్పం

బాబు మాటలకు ఏమారే ప్రసక్తే లేదు



నేను ఉమామహేశ్వరి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. 2014 ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే డ్వాక్రా రుణం మాఫీ అవుతుందని ప్రకటించారు. మా గ్రూపునకు రూ. లక్ష అప్పు ఉండటంతో రుణమాఫీ అవుతుందని ఆశపడ్డాం. ఆ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినా రుణమాఫీ గురించి పట్టించుకోలేదు. 2019 ఎన్నికలు సమీపించే సమయంలో మహిళలు అందరూ ఆగ్రహంగా ఉన్నారని తెలుసుకుని మభ్య పెట్టడం కోసం పసుపు–కుంకుమ పేరిట మమ్మల్ని మోసం చేయాలని చూసిన ఘనుడు చంద్రబాబు. ఆయన పసుపు–కుంకుమతో ఏమార్చాలని చూస్తే మేమందరం ఓటుతో ఉప్పు, కారం పెట్టి సాగనంపాం. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆసరా పేరిట రుణమాఫీ చేశారు. ఏడాదికి రూ. 24,950 చొప్పున నాలుగేళ్లకు మా రుణం మొత్తం మాఫీ అయింది. ఎన్నికల్లో చెప్పిన మాటపై నిలబడింది ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే. మళ్లీ ఇప్పుడొచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని మాటలు చెప్పినా ఏమారే ప్రసక్తే లేదు. – జైలా, ముడిపల్లె, నగరి మండలం

మాకు అప్పులే మిగిల్చారు



నేను గత 15 ఏళ్లుగా మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉంటున్నా. చంద్రబాబు మాటలు నమ్మి 2014 ఎన్నికల్లో టీడీపీకి ఓటేశాం. డ్వాక్రా రుణం మాఫీ చేస్తారని ఆశపడ్డాం. బ్యాంకులో తనఖా పెట్టిన నగలు విడిపిస్తారని నమ్మాం. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మమ్మల్ని పట్టించుకోలేదు. రుణం మాఫీ చేయలేదు. తాకట్టు పెట్టిన నగలను విడిపించలేదు. చివరకు మాకు అప్పులే మిగిల్చారు. 2019 ఎన్నికలు వచ్చేసరికి ఆయనకు మా ఓట్లు గుర్తుకు వచ్చినట్టు ఉన్నాయి. పసుపు–కుంకుమ అంటూ రూ.10వేలు ఇచ్చి మాయ చేయాలని చూశారు. ఎక్కడికక్కడ సభలు పెట్టి బూటకపు హామీలు గుప్పించారు. సెల్‌ఫోన్ ఇస్తామని చెప్పి మోసం చేశారు. అందుకే ఆ ఎన్నికల్లో టీడీపీ నామరూపాల్లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా డ్వాక్రా రుణమాఫీ చేసింది. నాకు నాలుగు విడతల్లో రూ.66వేల రుణం తీరిపోయింది. అలాగే సున్నావడ్డీ కింద మరో రూ.12వేలు వచ్చింది. మాకు ఇంత సాయం చేసిన జగనన్నకే జీవితాంతం అండగా ఉంటాం. – ఈశ్వరి, డ్వాక్రా మహిళ, గుడిపాల మండలం

వడ్డీలకే పోయింది



అధికారం కోసం చంద్రబాబు నాయుడు 2014లో తప్పుడు హామీలు ఇచ్చి మమ్మల్ని మోసం చేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత చేస్తామని చెప్పిన రుణమాఫీని గాలికి వదిలేశారు. దీంతో మేము బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు తడిసిమోపెడాయ్యాయి. 2019 ఎన్నికల సమయంలో మాత్రం పసుపు– కుంకుమ అంటూ మాకు ముష్టి వేశాడు. అది కూడా బ్యాంకు వడ్డీలకే పోయింది. మా చేతికి పైసా రాలేదు. ఆయన ఇచ్చిన పసుపు–కుంకుమతో మాకు ఒరిగిందేమీ లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకే అండగా నిలుస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీని విడతల వారీగా అమలు చేశారు. నాలుగేళ్లుగా వివిధ పథకాలతో మమ్మల్ని ఆర్థికంగా బలోపేతం చేశారు. జగనన్న పుణ్యాన హాయిగా జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబు బూటకపు హామీలతో వస్తున్నారు. ఆయన మాటలను ఎలా నమ్మగలం. – ఎస్.ప్రభావతి, ఈస్ట్‌పేట, పుంగనూరు

మా ఉసురు తగిలింది



డ్వాక్రా సంఘంలో సభ్యులుగా ఉంటూ ఆర్థికంగా ఎదుగుతున్న మాలాంటి మహిళలకు చంద్రబాబు తీరని ద్రోహం చేశారు. తనను గెలిపిస్తే పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా మాఫీ చేస్తానని, అడవాళ్లు ఎవరూ బ్యాంకులకు రుణాలు తిరిగి కట్టవద్దని 2014 ఎన్నికల ముందు ఆయన పదే పదే చెప్పారు. దాన్ని నమ్మి ఇందిరా పొదుపు సంఘంలోని మేము బ్యాంకుకు రూ.2లక్షల రుణం రీ పేమెంట్ చేయకపోవడంతో గ్రూపు డిఫాల్టర్ జాబితాలోకి వెళ్లిపోయింది. గ్రూపులు బాగా జరిగితే తక్కువ వడ్డీతో అవసరానికి అప్పులు దొరికేవి. అదీ లేకుండా చేశారు. ఆయన సీఎం అయినా రుణాలు మాఫీ చేయకుండా మళ్లీ 2019 ఎన్నికల ముందు పసుపు–కుంకుమ పేరుతో ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇస్తామని కొందరికే ఇచ్చారు. అందుకే మా ఆడవాళ్ల ఉసురు తగిలి అప్పుడు అధికారం నుంచి దిగిపోయారు. ఇక ఎప్పటికీ చంద్రబాబు సీఎం కాలేరు. కానీ జగన్ మోహన్‌రెడ్డి వయసులో చిన్నవాడైనా 2019లో చెప్పిన మాట ప్రకారం మా గ్రూపునకు ఉన్న రూ 5,49,600 రుణం మాఫీ చేశారు. ఒక్కో సభ్యురాలికి రూ.13,750 వంతున నాలుగు విడతలుగా మా అకౌంట్లలో నగదు జమ చేశారు. మాకు మేలు చేసిన జగనన్న వెంటనే మేము నిలబడతాం. – ఈశ్వరి, కడపల్లె, శాంతిపురం

చంద్రబాబు అవకాశవాది



డ్వాక్రా మహిళలకు కనీసం రూ.3వేలు రుణమాఫీ చేయని చంద్రబాబు, ఎన్నికలు వచ్చేసరికి అమ్మకు వందనం, వృద్ధాప్య పింఛన్ పెంపు అంటూ హామీలు గుప్పిస్తున్నారు. 2014 ఎన్నికల సమయంలో పొదుపు సంఘాలకు రుణమాఫీ అంటూ మాయమాటలు చెప్పి నిలువునా మోసం చేశారు. ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలను డీ గ్రేడ్‌కు తీసుకువచ్చి బ్యాంకు అధికారులతో తిట్టించారు. మళ్లీ 2019 ఎన్నికలు వచ్చినప్పుడే మహిళలు గుర్తుకు వచ్చారు. ఏదో చిల్లర డబ్బులు పడేస్తే నమ్మి ఓటేస్తారులే అని పథకం ప్రకారం పసుపు–కుంకుమ పేరుతో రూ.10వేల చొప్పున కొందరికే డబ్బులు వేశారు. అందుకే ఆ ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పాం. అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని కష్టాలు వచ్చినా విడతల వారీగా రుణమాఫీ చేశారు. ఆయన చేసిన రుణమాఫీ, అందించిన సంక్షేమ పథకాలతోనే మా కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. జగనన్న వల్ల ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మేము ఎప్పుడూ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. చంద్రబాబు పచ్చి అవకాశవాది. ఆయనను నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. – వసంతమ్మ, పెద్దతయ్యూరు, ఎస్ఆర్‌పురం మండలం

రేపే ఎన్నికలకు నోటిఫికేషన్

- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు మార్చి 16 షెడ్యూల్ విడుదలైంది. కాగా, ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. ఎన్నికల్లో ప్రధానమైన నామినేషన్‌ల ఘట్టం గురువారం నుంచి జిల్లాలో మొదలుకానుంది. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఈ మేరకు నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్, చిత్తూరు ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ


సార్వత్రిక ఎన్నికల్లో తొలి అంకమైన నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సక్రమంగా పూర్తి చేసి రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)కి సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్‌లో అభ్యర్థుల ఆస్తులు, నేరచరిత్ర, కులం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏ మాత్రం పొరపాటు జరిగినా వారి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల నామినేషన్‌పత్రాల్లో వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

నామినేషన్లు స్వీకరించే అధికారులు

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	కార్యాలయం
చిత్తూరు పార్లమెంట్	షణ్మోహన్, కలెక్టర్	కలెక్టరేట్, చిత్తూరు
చిత్తూరు అసెంబ్లీ	శ్రీనివాసులు, జేసీ	కలెక్టరేట్, చిత్తూరు
పుంగనూరు అసెంబ్లీ	మధుసూదన్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	తహసీల్దార్ కార్యాలయం, పుంగనూరు
నగరి అసెంబ్లీ	వెంకటరెడ్డి, ఆర్డీఓ,	తహసీల్దార్ కార్యాలయం, నగరి
జీడీ నెల్లూరు అసెంబ్లీ	వెంకటశివ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్	తహసీల్దార్ కార్యాలయం, జీడీ నెల్లూరు
పూతలపట్టు అసెంబ్లీ	చిన్నయ్య, ఆర్డీఓ,	తహసీల్దార్ కార్యాలయం, పూతలపట్టు
పలమనేరు అసెంబ్లీ	మనోజ్‌రెడ్డి, ఆర్డీఓ	ఆర్డీఓ కార్యాలయం, పలమనేరు
కుప్పం అసెంబ్లీ	జి.శ్రీనివాసులు,	తహసీల్దార్ కార్యాలయం, కుప్పం



పకడ్బందీగా కసరత్తు



నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నామినేషన్‌ల ప్రక్రియ మొత్తం నిఘా నీడలో జరుగుతుంది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఈసీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లను స్వీకరిస్తాం. నామినేషన్‌ల స్వీకరణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఆర్ఓలకు క్షుణ్ణంగా ఆదేశాలిచ్చాం. – షణ్మోహన్, కలెక్టర్

అభ్యర్థితో పాటు నలుగురికే అనుమతి



నామినేషన్‌లు దాఖలు చేసేందుకు వచ్చేప్పుడు అభ్యర్థితో పాటు నలుగురు మద్దతుదారులకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుంది. ఆర్ఓ కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆర్ఓ కార్యాలయం నుంచి వంద మీటర్ల దూరం వరకు మూడు వాహనాలనే అనుమతిస్తారు. నామినేషన్ల స్వీకరణను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. – శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణకు 9 మంది అబ్జర్వర్లను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. త్వరలోనే అబ్జర్వర్లు జిల్లాకు రానున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం చేపడుతోంది. వీటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని సైతం నియమించింది. ఒక్కో అబ్జర్వర్‌కు డిప్యూటీ తహసీల్దార్ కేడర్‌లో ఉన్న వారిని లైజన్ అధికారిగా, హెల్పర్‌గా వీఆర్ఏను కేటాయించింది.

- **షాదిక్ అలమ్ (జనరల్ అబ్జర్వర్) :** చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలు
- **కైలాష్ వాంఖడే (జనరల్ అబ్జర్వర్) :** చంద్రగిరి (తిరుపతి జిల్లా), నగరి, గంగాధరనెల్లూరు
- **శంకర్‌ప్రసాద్ శర్మ (ఖర్చుల అబ్జర్వర్) :** చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం
- **శ్రీనివాస్ ఖన్నా (ఖర్చుల అబ్జర్వర్) :** పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు
- **రోహన్ ఠాకూర్ (ఖర్చుల అబ్జర్వర్) :** చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలు.
- **అరవింద్ హెచ్ సాల్వే (పోలీస్ అబ్జర్వర్) :** సర్వేపల్లె, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు (తిరుపతి జిల్లా), నగరి, జీడీ నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం (చిత్తూరు జిల్లా) నియోజకవర్గాలు

క్లుప్తంగా

10 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా ప్రతాలు అందిస్తున్న వలంటీర్లు

కుప్పంరూరల్ : మండలంలోని కృష్ణదాసనపల్లె పంచాయతీకి చెందిన 10 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్ బాలకృష్ణకు తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. వలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెందామన్నారు. ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం దారుణమని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి అండగా నిలుస్తామని తెలిపారు.

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత



పోలీస్‌స్టేషన్ బాలిక

బైరెడ్డిపల్లె : స్థానిక ఇండియన్‌బ్యాంక్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ఓ చిన్నారిని వదిలివెళ్లారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో ఓ లారీ డ్రైవర్ డబ్బులు డ్రా చేసుకోవడానికి ఏటీఎంకు వెళ్లగా చిన్నారి కనిపించింది. ఆయన వెంటనే ఆ చిన్నారిని బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. ఈ క్రమంలో మంగళవారం పత్తికొండకు చెందిన చిన్నారి తల్లిదండ్రులు పోలీసులను సంప్రదించారు. తమ బిడ్డను అప్పగించాలని కోరగా సీఐ కృష్ణమోహన్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. అనంతరం బిడ్డను అప్పగించారు. ఎస్‌ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నగరి : ఏకాంబరకుప్పంలోని ఏటీఎం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్య కారణంగా మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీఐ సురేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహారం అందిస్తూ.. ఆకలి తీరుస్తూ..!

అన్ని దానాల్లోకి అన్నదానం మహోన్నతమైందంటారు. ఇదే మాటను ఆదర్శంగా తీసుకుని ఎమ్మెల్సీ భరత్ ఏడాది నుంచి కుప్పం పట్టణంలో రాజన్న క్యాంటిన్ నిర్వహిస్తున్నారు. నిత్యం రెండు పూటలా వందలాది మంది పేదల కడుపు నింపుతున్నారు. ఆకలితో అలమటించేవారికి రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. ఉదయం.. మధ్యాహ్నం ఉచితంగా భోజనం వడ్డించేలా కార్యాచరణ అమలు చేస్తూ ప్రజల అభిమానం చూరగొంటున్నారు.



కుప్పంలో రాజన్న క్యాంటిన్ వద్ద భోజనం తీసుకుంటున్న జనం

- పేదల కడుపునింపుతున్న రాజన్న క్యాంటిన్
- కుప్పంలో ఉచితంగా భోజనం అందిస్తున్న భరత్
- రెండు పూటలా వందల మందికి పంపిణీ
- రుచికరంగా నాణ్యతతో కూడిన వంటలు

కుప్పం : మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన కుప్పం పట్టణానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. ముఖ్యంగా అటవీ సమీప గ్రామాలవారు అధికంగా వస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం ఉదయం కుప్పానికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లేప్పటికి సాయంత్రం అవుతుంది. అందులో హోటల్‌కు వెళ్లి భోజనం చేసే స్తోమత లేనివారు చాలా మంది ఉంటారు. అలాంటి వారి కోసం వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. సుమారు ఏడాది నుంచి ఉదయం, మధ్యాహ్నం పేదలకు ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. ఇందుకోసం రాజన్న క్యాంటిన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఉదయం 7.30 గంటల నుంచి పూల మార్కెట్ వద్ద ముందుగా అల్పాహారం ఉచితంగా అందిస్తారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, కూలీలు సుమారు 500 మంది వరకు ఇక్కడ టిఫిన్ చేస్తుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతి గంగమ్మ గుడి ఎదురుగా రాజన్న క్యాంటిన్ భోజనం ప్రారంభిస్తారు. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, కూలీలు తమ క్షుద్బాధ తీర్చుకుంటారు.

చాలా బాగుంది



రాజన్న క్యాంటీన్‌లో భోజనం చాలా బాగుంది. ఏడాదిగా కుప్పం టౌన్‌కు వస్తే ఇక్కడే భోజనం చేసి సాయంకాలం ఊరికి పోతా. అన్నం, సాంబారు, పెరుగన్నం పెడుతున్నారు. చాలా రుచిగా ఉంటోంది. కుప్పంలో ఇప్పటి వరకు ఇలాంటి భోజనం పెట్టిన వారు లేరు. గ్రామాల నుంచి వచ్చేవారికి ఈ క్యాంటిన్ చాలా సౌకర్యంగా ఉంది. భరత్ బాబు చల్లగా ఉండాలి.

– వెంకటప్ప, నూలుకుంట, కుప్పం మండలం

తృప్తిగా వడ్డిస్తున్నారు



ఇప్పుడు ఉన్న ధరలకు ఇలాంటి నాణ్యమైన భోజనం పెట్టడం ఎంతో గొప్ప విషయం. పప్పు సాంబారు. గింజల పులుసు, పెరుగు అన్నం అడిగినంత పెట్టి కడుపు నింపుతున్నారు. రాజన్న క్యాంటిన్ భోజనాలు పెట్టడంలో ఎక్కడా తగ్గకుండా ప్రతి ఒక్కరు తృప్తిగా తినేలా వడ్డిస్తున్నారు. ఏడాది నుంచి మేము ఎప్పుడు కుప్పం వచ్చినా ఇక్కడే అన్నం తింటున్నాం.

– వెంకటేష్, నూలుకుంట

మెనూ ఇలా..

రోజు	ఉదయం	మధ్యాహ్నం
ఆదివారం	విజిటబుల్ రైస్, కుర్మా	అన్నం, నూనె వంకాయ్, రసం, పెరుగు
సోమవారం	పొంగల్, సాంబార్	అన్నం, ములక్కాయ్, రసం, పెరుగు
మంగళవారం	టమాటా బాత్, చట్నీ	అన్నం, ఆకుకూర పప్పు, పెరుగు
బుధవారం	కిచిడీ, చట్నీ	అన్నం, బీరకాయ సాంబారు, పెరుగు
గురువారం	గ్రీన్ రైస్, కుర్మా	అన్నం, సొరకాయ కూర, రసం, పెరుగు
శుక్రవారం	పులిహోరా, చట్నీ	అన్నం, ముల్లంగి సాంబారు, పెరుగు
శనివారం	లెమన్ రైస్, చట్నీ	అన్నం, బెండకాయ్ పులుసు, పెరుగు

పస్తులు తప్పాయి



బుట్టలో తాటి బెల్లం తెచ్చి అమ్ముకుని బతుకుతుంటాం. రోజూ కుప్పం వచ్చి వ్యాపారం చేసుకుని పోతాం. తాటి బెల్లం అమ్మితే వచ్చే డబ్బులు హోటల్ వెళ్లేందుకు సరిపోవు. దీంతో రాత్రి ఇంటికి వెళ్లాకే అన్నం తినేవాళ్లం. రాజన్న క్యాంటిన్ వచ్చినప్పటి నుంచి మాకు మధ్యాహ్నం పస్తులు తప్పాయి. రెండు పూటలా కడుపునిండా తింటున్నాం. గతంలో మధ్యాహ్నం తర్వాత శక్తి లేక 3 గంటలకే తిరిగి వెళ్లిపోయేవాళ్లం. ఇప్పుడు హాయిగా సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుంటున్నాం.

– లక్ష్మి, కందిలి, తమిళనాడు

అన్నదాత బాగుండాలి



రోజూ రెండు పూటలా ఉచితంగా భోజనాలు పెట్టడం చిన్న విషయం కాదు. కుప్పం ప్రజలపై ఉన్న అభిమానంతోనే రాజన్న క్యాంటిన్ ఏర్పాటు చేసిన భరతన్న నిజంగా గొప్ప మనిషి. ఇది వరకు మా గ్రామం నుంచి కుప్పం వస్తే మధ్యాహ్నం పస్తులు ఉండాల్సిందే. రాత్రి ఇంటికి పోయే వరకు ఆకలితో అల్లాడిపోయే వాళ్లం. ఇప్పుడు రాజన్న క్యాంటిన్ మా ఆకలి తీరుస్తోంది. పేదల కడుపు నింపుతున్న అన్నదాత బాగుండాలి.

– రఫీ, సంగనపల్లె, గుడుపల్లె మండలం

అలసత్వం లేకుండా విధులు



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : అలసత్వం లేకుండా ఎంసీసీ, వ్యయ పర్యవేక్షకులు ఎన్నికల విధులు నిర్వర్తించాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్), వ్యయ పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థి ఇంటి నుంచి బయలుదేరే సమయం నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయిని సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అవసరమైతే బృందాలను పెంచుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులకు ఉత్తర్వులను వెంటనే పంపాలని మ్యాన్ పవర్ టీమ్ నోడల్ అధికారిని ఆదేశించారు. ఆయా పార్టీలు ప్రచార వాహనాలకు ఇచ్చిన అనుమతులను తప్పనిసరిగా వాహనంపై అతికించాలన్నారు. లేకుంటే వాహనాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రచార సమయంలో బాణసంచా పేల్చితే కేసులు నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, చిత్తూరు నగర పాలక కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

నల్ల బెల్లం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామకుప్పం: సారా తయారీ కోసం నల్ల బెల్లం తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ననియాల గ్రామానికి చెందిన ఆర్ముగం, వీర్నమల గ్రామానికి చెందిన మహేంద్ర నాయక్ బొలేరో వాహనంలో నల్లబెల్లం తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 3,600 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



మంత్రి రోజాను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు, యువత



పార్టీలో చేరిన వేణుగోపాలపురం వాసులతో మంత్రి రోజా

నిండ్ర : మండలంలోని కొప్పేడు, కొప్పేడు దళిత వాడ, వేదాంత పురం ఎస్టీ కాలనీకి చెందిన 50 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఈ మేరకు మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి రోజా కార్యాలయం వద్ద కండువాలు కప్పుకున్నారు. అనిల్ కుమార్, సునీల్ కుమార్, చెంచమ్మ ఆధ్వర్యంలో కొప్పేడు, కొప్పేడు హరిజనవాడ వేదాంతపురం ఎస్సీ కాలనీలకు చెందిన టీడీపీ నేతలు, యువత పార్టీలో చేరారు. వీరిలో విక్కీ, ధనుష్, సంజయ్, దుష్యంత్, రాహుల్, శింబు, మోహన్, అనిల్ కుమార్, ఉపేంద్ర, శివప్రసాద్, పాలయ్య, ఆకాష్, సూర్యా , ఉదయ్, భాగ్యరాజ్, ధనయ్య, సుధీర్, వరలక్ష్మి, మురుగమ్మ, నితిన్, చెంచయ్య, దేసయ్య, జాక్, సుభాష్, జీవ, గణేష్, మహేష్, దేవప్రసాద్, వంశీ, సూర్య, ఢిల్లీ, బాబు, లోకేష్ తదితరులున్నారు. అలాగే నిండ్రకు చెందిన బాబురెడ్డి ఆధ్వర్యంలో కొప్పేడు, చవరంబాకం, ఇరుగువాయిలోని టీడీపీకి చెందిన 45 డప్పు కళాకారుల కుటుంబాలు మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. వీరిలో అపరంజి, రామన్, కృష్ణయ్య, అన్నమలై, రవి, దొరస్వామి, అరుణ్, వేలు, వసంతరాజు, ఎలుమలై, తంగదొరై, రాజేంద్రన్, విజయన్, రాజీవ్ గాంధీ, యుగంధర్, ఎలుమలై, రవీంద్రన్, శివలింగం, ఆర్.ఏలుమలై, రామయ్య, ఆర్ జయచంద్రన్, జి.కుప్పయ్య, పెరుమాళ్, వీకే రామస్వామి, మణి, మురగయ్య, వి.సుబ్రమణి, ఏలుమలై, అమాసై, బి.సుబ్రమణ్యం, వేలాయుధం, వేలు, వజ్రం, మోహన్, సి.సుబ్రమణ్యం, గజేంద్ర ఉన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

పుత్తూరు: మండల పరిధిలోని తడుకు పంచాయతీ వేణుగోపాలపురం గ్రామానికి చెందిన 36 మంది టీడీపీ నేతలు మంగళవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి రోజా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న తమ మనసు వైఎస్సార్‌సీపీ వైపే నడిపించిందని వెల్లడించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి రోజా పేదలను ఆదుకుంటున్న వైనం తమకు ఎంతో సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజాతో కలిసి నడవడానికి తాము నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రాణెమ్మ, మునెమ్మ, దేశమ్మ, జానకి, జ్యోతి, పుష్ప, అంజలమ్మ, ఈశ్వరమ్మ, మంగమ్మ, సుబ్బమ్మ, ఉష, కన్నెమ్మ, కాంతమ్మ, సంపూర్ణ, నరసమ్మ, సరళ, చిట్టెమ్మ, చిరంజీవి, మహేష్, సురేంద్ర, వేణుగోపాల్, నరసింహులు, సురేష్, మనోజ్, మునికృష్ణ, సుబ్బయ్య, వెంకటముని, మణి, శంకర్‌రెడ్డి, సుబ్బయ్య, బాబు, చిన్నబ్బ, నరసింహులు, సుధాకర్ ఉన్నారు.

సొంతగూటికి చామనేరు వాసులు

పలమనేరు : పెద్దపంజాణి మండంల చామనేరు పంచాయతీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాయమాటలు నమ్మి టీడీపీలోకి వెళ్లామని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, తమ ఇంట్లోని మహిళలు మండిపడడంతో తమకు కనువిప్పు కలిగిందని వెల్లడించారు. చేసిన తప్పుకు పశ్చాత్తాపం చెందుతున్నామని, మరోసారి ఇలాంటి పనిచేయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



ఎమ్మెల్యే వెంకటేగౌడతో చామనేరు వాసులు

కల్పవృక్ష వాహనంపై సీతారాములు



సీతారాముల ఊరేగింపులో అధికారులు



వేల్కూరులో కొలువుదీరనున్న సీతారామలక్ష్మణులు



ఊంజల్ సేవలో దేవదేవేరులు

కార్వేటినగరం: శ్రీరామనవమి వార్షికోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో వెలసిన శ్రీసీతారామ, లక్ష్మణులు కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివార్లను మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి ఉత్సవ మూర్తులకు పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, నారికేళీ వంటి జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో వేద పండితులు వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం స్వామివార్లను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేద పండితులు గోవింద నామ స్మరణలతో నేత్రపర్వంగా ఊంజల్‌సేవ చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను మండపానికి వేంచేపు చేసి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారుతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.15 గంటలకు వేద పండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింపజేశారు. ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు నారాయణ దాసరి, గోపాలాచారి పాల్గొన్నారు.

నేడు కల్యాణం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామంలో శ్రీ సీతా సమేత రాముల కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఉదయం సీతారాముల వారికి ప్రత్యేక అభిషేకపూజలు జరుగుతాయన్నారు. అర్చకులు వేదమంత్రాలు నడుమ కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వడదెబ్బకు ఆటోడ్రైవర్ మృతి

చౌడేపల్లె : వడదెబ్బకు గురై ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మేదరదొడ్డికు చెందిన నూరుల్లా (30) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎండ తీవ్రత కారణంగా ఆటో వద్ద ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కాగా అతడి తండ్రి షఫీ రెండునెలలక్రితం అనారోగ్య కారణంగా మృతి చెందాడు. రెండు నెలల్లో ఇద్దరు కన్నుమూయడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి

కుప్పంరూరల్ : మానసిక స్థితి సరిగా లేని దివ్యాంగురాలిపై ఓ మానవ మృగం లైంగికదాడికి పాల్పడిన ఘటన మంగళవారం కుప్పం మండలం, మల్లానూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన దివ్యాంగురాలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి లైంగికదాడి చేశాడు. అభాగ్యురాలు కేకలు వేయడంతో రమేష్ పారిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి వెళ్లి బాధితురాలిని చికిత్స నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై కుప్పం ఎస్‌ఐ రామసుబ్బారెడ్డిని వివరణ కోరగా.. వైద్యుల నివేదిక అనంతరం లైంగికదాడిని నిర్ధారించనున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

విషయం తెలుసుకున్న ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ చైర్మన్ సుధీర్ ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. బాలికకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. తక్షణ సాయం కింద రూ.10వేల ఆర్థికసాయం అందించారు.